# మరచిపోయిన జ్ఞాపకం

రచయిత: శ్రీ సూరిశెట్టి సాంబశివరావ్ బాబ్జీ

★

దీపావళినాటి సాయంకాలం నాల్గుగంటలకే నేను స్టేషన్లో దిగింది మొదలు ఒకటే కోలాహలం!—ఒకటే ఆనందం! ఆవూళ్ళో యే వీధి చూసినా కళకళలాడ్తూంది. ఏ యిల్లు చూసినా పచ్చని తోరణాలతో—అరటిచెట్ల ఆర్చీలతో అలరారుతోంది—వూరు చిన్నదైనా యేమూలకి వెళ్ళినా ఆనందంతో—ఉత్సాహంతో—స్వర్గసీమకి మల్లే కనిపిస్తోంది. రాజు మొదలుకుని రైతుదాకా ప్రతివాని మొహం యేదో నూతనశోభతో కళకళలాడ్తూంది. బజారు దుకాణాల్లో రకరకాల రంగురంగుల సామాన్లు జగజగా మెరుస్తున్నాయ్. పిల్లలంతా నీటి కెరటాలకి మల్లే వొచ్చి దీపావళి సామాన్లూ కొనుక్కోటాని అటూయిటూ పరుగెత్తుతున్నారు. షావుకార్లంతా కొత్త చిఠాల హడావిళ్లో కొట్టుకు పోతున్నారు. ప్రతీరోడ్డూ జనంతో కిటకిట లాడి పోతోంది.

నేను పూర్తిగా పట్నం వాతావరణాని కలవాటు పడ్డవాణ్ని కావటం మూలాన నాకిదంతా అదో విధమైన విచిత్రానుభవాన్నీ, ఆనందాన్నీ, కలిగించింది. ఓ అరగంటలో బజారు వీధులన్నీ దాటుకుంటూ జట్కా మా అక్కయ్య యింటిముందాగింది. మామయ్య రఘురామయ్య గారూ, మా అక్కయ్యా నాకెదురుగా వొచ్చి నన్ను చూడగానే యెంతో ఆత్రంగా—సంతోషంగా—గౌరవప్రదంగా పరామర్శచేసి లోపలికి తీసుకెళ్లారు. ఇంట్లో కెళ్ళి చూసేప్పటికి నాకు మరింత ఆశ్చర్యం కలిగింది. చిన్నపిల్లల చిటపటాలగోల—అమ్మలక్కల పిండివంటల గుసగుసలూ—ఆడపిల్లల చీరెల యెంపుల్లూ—చుట్టాల పండుగ పరామర్శలూ—పెద్ద వాళ్ల దీపారాధన హడావుడీ—యివన్నీ నిజానికి నాకెంతో వ్యాకులపాటు కలిగించినై. నిశ్చలంగా—నిర్మలంగా వుండేచోట తిరుగుతూంటం నాకలవాటు. అంచేత బజారు గోలతో నిండిపోయిన ఆయింట్లో ఒక్క పావుగంటసేపుకూడ వుండటం కష్టమనిపించింది. అయిదారేళ్ళకి మళ్ళీ నేనిదే ఆవూరు రావటం!

నేనిలా విసుక్కుంటూ వున్నంతలోనే అక్కయ్య గబగబావొచ్చి,—"కాళీ, మన తోట్లో కెళ్లి కాసిని అరిటాకులు కోసుకురావోయ్" అంది.

అది విని నాకు పట్టరానంత ఆనందం కలిగింది. యీవంక మీదయినా పైకి వెళ్లిపోవొచ్చుగదా అని డ్రెస్ మార్చుకుని బయల్దేరాను తోటవేపుకి.

దీపావళి జ్యోతుల దివ్యసౌందర్యాన్ని తిలకించి ఆనందించి అనుభవించే అదృష్టం, తనకిలేదుగదా అని వాలిపోయిన మొహంతో—చెదిరిపోయిన కళలతో—పడమటి కొండల వెనక్కి దిగిపోతున్నాడు భానుమూర్తి.

తోటంతా ఓమాటు పచారుచేసి నేను అరిటాకులు కోసేందుకు బయల్దేరాను. ఇలా ఆకులు కోసేందుకి చేతు లెత్తేప్పటికి టపీమని నావొంట్లో యేదో విద్యుత్ప్రవాహానికి మలే చమక్మని ప్రవహించింది. ఏదో అజ్ఞాతభయం చట్టున ఆవరించింది. మరిచిపోయిన జ్ఞాపకమేదో మళ్లీ భగ్గునలేచి హృదయాన్ని కెలికి కెలికి పారవేసింది. మొహం తిరిగిపోయినట్టయింది. వెంటనే నేను అఘళంగా గట్టుపైని చతికిలబడిపోయాను. గతం వేపుకి మనసు తిప్పి ఆలోచన ప్రారంభించాను—

నేను చదువుకుంటున్న రోజుల్లో ఓనాటి సాయంకాలం—

తోటకి షికారుకని బయల్దేరాను. నింపాదిగా అడుగులేసుకుంటూ వొస్తూంటే యెక్కణ్నుంచో ఓ మృదుమధురగానం వినిపించింది. కమ్మని కంఠం నన్ను చట్టున ఆకర్షించుకుంది. గబగబా ఆ కంఠాన్ని వెతుకుతూ పరుగెత్తాను.

అరటితోటలో— తన నవకోమల హస్తాలతో— ఆకులు కోస్తూ పాడుకొంటూంది ఓ సుందరాంగి! దూరాన్నుంచే నే నామెకి కనిపించకుండా తొంగిచూశాను. గాలి కటూయిటూ వేలాడ్తూన్న ముంగురులూ—ఆకాశం వేపు చూస్తోన్న పద్మనయనాలూ—గులాబీల్లాంటి యెర్రని పెదవులూ—చిదిమితే పాల్గారే తెల్లని శరీరచ్ఛాయి—పైకెత్తివుంచిన తామర తూడుల్లాంటి సన్నని చేతులూ—సన్నని చుక్కచుక్కల చీర—మెళ్లో మెరుస్తూన్న జిగినీ గొలుసూ—లేతాకు పచ్చరంగు సిల్కుజాకెట్—లోపలనించి తొంగి చూస్తూ పైటని గూడా తొలగించి ఆహ్వానిస్తోన్న ఆమె స్థనాలూ—మెలికలు తిరిగిన సన్నని నడుం—పాటకి సరిపోయేట్టు లయవేస్తోన్న ఆమె గాజులూ—ఇవన్నీ నన్ను ఒక్కసారిగా ఉన్మత్తుణ్ని చేసివేసినై. నాలో ఓ విధమైన మత్తుని పుట్టించవేశాయ్. కాస్సేపటిదాకా ఆమె వేపు చూస్తూ నేను పారవశ్యాన్ని పొందాను. నేను మరి కాస్త దూరం ముందుకొచ్చి బాగా తేరిపారచూశాను కళ్లు నులుముకుని మళ్లీ చూశాను.

అరె! యింకా యెవరో అనుకున్నాను. మరెవరో కాదు. మా అక్కయ్య పెద్ద కూతురు అనసూయ. పద్దెనిమిదేళ్ల నవయవ్వనంలో తళతళ మెరుస్తోన్న అందాల అప్సరస!—నాకు మరింత ధైర్యం కలిగింది. అనసూయ అందచందాలు నన్ను దిగ్భ్రమ గావించినై. నా భోజనం, పడకా అంతా మా అక్కయ్య యింట్లోనే అయినా, నేనున్నంతసేపూ అనసూయ నాకంటపడకుండా సిగ్గుతో యేమూలనో దాక్కునేది. అక్కయ్యా, మామయ్యా ఆమెని నాకిచ్చి పెళ్లిచేసేందుకి నిర్ణయించుకున్నారు. అలాంటప్పుడు పెళ్లికిముందే ప్రేమ కలాపాలు ప్రారంభిస్తే తప్పేముందీ?—

యిలా ఆలోచించి ఆలోచించి నేను నాలో పొంగుకొచ్చే ఆవేశాన్ని ఆపుకోలేక కామోద్రిక్తుణ్నై వెనకనించేవొచ్చి టక్కున అనసూయ కళ్ళు మూశాను. అనసూయ తుళ్లిపడి పాట ఆపేసింది. కోసిన ఆకులు క్రింద పడేసింది.

“ఎవరు?” అంది చేతులు విదలిస్తూ గాబరాగా.

“నీప్రియుడే” అన్నాను నింపాదిగా చిరునవ్వుతో.

“అమ్మదొంగా, మురళీగదూ!” అంది ధీమాగా.

“అబ్బే, మురళి యెవరు, నేను, అనసూ” అంటూ పకాల్న నవ్వుతూ చేతులు విప్పేశాను.

“అబ్బా! నువ్వా మామయ్యా? ఎంత గట్టిగా నొక్కేశావ్?” అంది కళ్లు నులుముకుంటూ.

“ఇదుగో, అనసూ,—ఓ చిన్నమాట”

“ఏమిటో చెప్పు, వేగం.”

“నువ్వు నన్ను ప్రేమిస్తున్నావు గదూ?”

ఛీ!—నువ్వన్నీ యిలాంటి మాటలే ఆడ్తావు మామయ్యా” అంటూ అనసూయ విసుగ్గొంటూ. ఓ మూలకి సిగ్గుతో తలొంచుకుని వెళ్లిపోయింది.

కాని నా భగ్నహృదయం అంతటితో వూరుకోలేదు. దుష్టబుద్ధి నాలో ప్రేరేపించింది. ఆమె నెలాగయినా ముద్దు పెట్టుకోవాలని నా హృదయం తహతహలాడింది. యీ సదవకాశాన్ని జారవిడచుకో గూడదని కృతనిశ్చయుణ్నయాను. మళ్లీ, ఆమెని నావైపుకి తిప్పుకుని బలవంతం చేస్తూ.

“అనసూ—ఒక్క ముద్దియ్యవూ?” అంటూ అడిగాను ప్రాధేయపడ్తూ.

“మామయ్యా” అంది అనసూయ గ్రుడ్లెర్రజేస్తూ.

“ఏం భయమా?” అంటూ నా పశుబలాన్నుపయోగించి ఆమెని మరింత దగ్గిరికి లాక్కుని ముద్దు పెట్టుకోబోయాను.

కాని వెంటనే నా చెంప ఫెడేల్మంది.

ఆమె యింక జవాబు చెప్పలేక పోయింది. మళ్లీ నేనేం చేస్తానో అని భయపడ్తూ అక్కణ్నించి గబగబా పారిపోయింది. నేను నిరాశాదృక్కుల్తో కొంటెగా ఆమె వేపు చూస్తూ వుండి పోయాను. అనసూయ చేసిన యీ కొంటె పనికి నాకు చాలాకోపం వొచ్చింది. మనసు నొచ్చుకున్నాను. ఆఖరి కామెపైని ఓ విధమైన అనుమానం జనించింది. ఆలోచనలతో బరువెక్కిన తల పట్టుకుని విచారంగా యింటివేపుకి పయనమయ్యాను.

ఆనాటి రాత్రి యెంత ప్రయత్నించినా నాకు నిద్ర పట్టిందికాదు. వెంటనే లేచి యెదురుగావున్న కిటికీలోంచి బయటికి చూశాను. జాబిల్లి తన వెండివెలుగుల్ని ప్రపంచం

పైకి దాడి పంపుతున్నాడు. తాణాకచేరీలో అప్పుడే పన్నెండు కొట్టింది.

ప్రకృతిలో ప్రతీ అణువూ నిద్రపోతోంది. ప్రపంచమంతా నీరవత్వాన్ననుభవిస్తోంది. ఆ నిశ్శబ్దాన్ని చీల్చుకుంటూ నింపాదిగా వొస్తోన్న చిన్న గుసగసలు చట్టున నాచెవిని పడ్డాయ్. నేను విస్తుపోతూ మెల్లిగా అటువేపు కెళ్లి ఆలకించసాగాను.

"మురళీ!"

"అనసూ!"

"ఆ జాబిల్లి చూశావా యెంత సరదాగా కిలకిల నవ్వుతున్నాడో!"

"నీ అందాల్ని ఖూరుకుందామని గామాల్సు"

"పోనిద్దూ—నీ కవిత్వమంతా యిక్కడే ఒలిపెయ్యాలా? "అవునుగాని మనిద్దరం యిలా ప్రేమించుకుంటూన్నట్టు యెవరికేనా తెలుస్తే?—"

తెలిస్తే—యేం చేస్తారు—మనల్ని వురితీసేస్తారా?—మనం ఒకే ఒక ఇల్లో చదువుకున్నాం. ఒకే జీవితనావలో ప్రయాణం చెయ్యదలచుకున్నాం."

"మురళీ, చిన్నమాట. యిక్కడ మనల్నింక సుఖంగా బ్రతకనీరు. ఇది అనుమానాల ప్రపంచం"

"అయితే యేంచేద్దాం, అనసూ?"

"ఎన్నాళ్లిలా రహస్యంగా అదురుబెదుర్తో కలుసుకోటం?—మన వివాహం యిక్కడ జరగటం కష్టమన్న సంగతి నీకూ తెలుసు—నాకూ తెలుసు. అంచేత యే కలకత్తాకో, మద్రాసుకో వెళ్లిపోయి అక్కడ పెళ్లి చేసుకుంటే?"

"భేష్. బావుంది. అనసూ— అలాచేద్దాం. ఈ వారంలోనే వెళ్లిపోదాం. నువ్వెక్కడుంటే అక్కడే వున్నాడనుకో యీ మురళీకూడా—మురళీయే అనసూ—అనసూయే మురళీ—మురళీ అనసూయకోసమే బ్రతుకుతాడు—అనసూ—అనసూ—మన చిన్నప్పటి స్కూలు దినాలు తలంపుకి తెచ్చుకో—దాగురుమూతల్లో నిన్నుపట్టి దొంగని చేశాను గదూ!"—అంటూ కితకితలు పెట్టాడు మురళీ—

నా హృదయంలో బడబాగ్ని రగులుకు పోయింది. మరి కాస్త ముందుకొచ్చి చూశాను. కరణంగారబ్బాయి మురళీమోహన్ వొళ్లో స్మార [illegible] నట్టు పడివుంది అనసూయ—పైటి సగం [illegible] పోయింది. ఆమె ముంగురుల్ని తన చేతుల్లో సవరిస్తున్నాడు మురళీ. పెరట్లో ఆవుల పాదిరి ప్రక్కని పెద్ద గడ్డిమేటు చాటున జరుగుతోన్న యీ ప్రేమ నాటకమంతా చూస్తూంటే నా రోమరోమంలోనూ విద్వేషాగ్ని రగులుకుంది. అనసూయ—మురళీపై అసూయ జనించింది. మళ్ళీ వెనక్కి తప్పుకుని ఆలకించటం మొదలెట్టాను.

"అనసూ, నీ ముద్దులో లోకాన్నే మరపించే మహాశక్తివుంది. ఇద్దరం కలిసివున్నంతసేపూ స్వర్గంలో వున్నట్టుంటుంది."

"మురళీ" అని చిరునవ్వు నవ్వింది అనసూయ తన చేతుల్ని మురళీ మెడచుట్టూ మెలిపెట్టి.

మురళీ ఆమె పెదవుల్ని ముద్దు పెట్టుకున్నాడు. ఆదృశ్యం మరి నేనింకా చూడలేక పోయాను. బుర్ర పరిపరివిధాల ఆలోచనలతో దిమ్మెక్కిపోయింది. అనసూయ యిలా వ్యవహరించటం నేనెంత మాత్రమూ సయించుకోలేకపోయాను. చట్టున వెనక్కితిరిగి చరచరా నా గదిలో కొచ్చేశాను. ఆరాత్రంతా నాకు నిద్రపట్టనే లేదు.

తర్వాత బ్రాహ్మణబ్బాయి మురళీమోహన్, అనసూయ ప్రేమ కలాపాలు సాగించుకొంటూన్నట్టు నేను చెప్పగానే అక్కయ్యకీ, మామయ్యకీ పట్టరానంత కోపం వొచ్చింది. దానికి పర్యవసానంగా అనసూయకీ—నాకూ పెళ్ళి ముహూర్తం నిశ్చయమై పోయింది. ఇప్పు డనసూయని ఒక్క అడుగేనా యింట్లోంచి పైకి వెళ్లనీయకుండా కాయిదా చేసివేశారు. నాకు అపరిమితానంద మయింది.

ఆఖరికి పెళ్లి రోజుగూడా సమీపించేసింది. యిల్లంతా చుట్టాలూ—బంధువులతో కిటకిట లాడ్తూంది. పెళ్ళి పెద్దలంతా హడావిడి పడ్తున్నారు. కాని తీరా చూసేసరికి అనసూయ తన ప్రక్కమీద లేదు. మాయమై పోయినట్టయింది. దాంతో ప్రతివారి మొహంలోనూ ఓ విధమైన వ్యాకులపాటు అలుముకుపోయింది.

నాకు వెంటనే అనుమానం కలిగి గబగబా పరుగెత్తి వెళ్ళి కరణం గారింట్లో వాకబుచేశాను. అక్కడా గూడా వాళ్లబ్బాయి మురళీ మాయం!—నాకు మరింతకోపం రగులుకొచ్చింది. స్టేషనుకి పరుగెత్తుకెళ్లి చూశాను. అక్కడ గూడా లేరు. తోటవేపు కెళ్లి నాలుగు వేపులా బాగా వెతికి చూశాను.

అరటితోట దగ్గిర—మామిడి చెట్టుక్రింద మురళీ—అనసూయల శవాలు పడివుండటం నాకు కనిపించింది. నా వొళ్లంతా గగుర్పాటు జెందింది. ఇది నిజమా, కలా అని నాకళ్లని నేనే కాస్సేపటిదాకా నమ్మలేకపోయాను. వాళ్లని చూడగానే నాకు భయోత్పాతం యెక్కువయింది. వెన్వెంటనే నేను చేసిన యీ ఘోరాపచారానికి పశ్చాత్తాపంగూడా నాకు బుద్ధిచెప్పింది. గజగజా వొణికే చేతుల్తో బెదిరి బేజారెత్తే మనసుతో నింపాదిగా నేను వారి శరీరాల్ని తాకాను. ఇంకెక్కడి అనసూయ! ఇంకెక్కడి మురళీ!—యీ పాపపు స్వార్థలోకాన్ని వొదిలిపెట్టి పోయారు. నాకంటిచినించి రెండు వేడి కన్నీటి బిందువులు యకాయకిని రాలిపోయినై. వారి కళేబరాల ప్రక్కని పడున్న కాయితం తీసి చదవటం మొదలెట్టాను.

"లోకం మమ్మల్ని వెలివేసింది. మా నిష్కళంక ప్రేమని త్రోసి పుచ్చింది. మేం చిన్నప్పటినుంచీ ఒకర్నొకరం ప్రేమించుకున్నాం. ప్రేమ సామ్రాజ్యంలో యెన్నెన్నో ఆశాసౌధాలు నిర్మించుకున్నాం. కాని స్వార్థపరుల చాందసాచారాలు వాటిని నేలమట్టం చేసివేసినై. యింక మాకు వేరేదిక్కు కనిపించలా. యీ నిర్మల ప్రేమ కోసరం మాప్రాణాల్ని సహా బలిదానంచేసి గ్రుడ్డిమానవలోకానికి బుద్ధి చెప్పాలన్న సంకల్పంతో మేం విషం మ్రింగి చచ్చి పోవాల్సొచ్చింది. ఇటుపైనయినా యువతీ యువకుల నిండు ప్రాణాల్ని నిలువునా తీయ ప్రయత్నించకండి. ఇదే మా ఆఖరికోరిక—సెలవు—

అభాగ్యజీవులు
మురళీ—అనసూయ.

ఈ ప్రేమైక జీవుల దుర్మరణానికి నేనే కారణభూతుణ్నని అప్పుడు గ్రహించి పశ్చాత్తాప పడ్డాను. ఆ అమరమూర్తుల పవిత్ర త్యాగానికి వూరి ప్రజలంతా శోక [illegible] భాష్పాలు పొంచినై. యెన్నో విధాలుగా కొ[illegible]డారు. ఏదియేమైనా వారిద్దరో అమరజీవులై పోయారు.

చటుక్కున యీకథంతా నాకా సమయంలో కళ్లకి కట్టినట్టు కనిపించింది. హృదయంలో యేవో తీవ్రమైన బాధ బయల్దేరింది. నా నయనాలు ధారాపాతంగా అశ్రుకణాలు చచ్చిపోయిన ఆ ప్రేమైక జీవులు మురళీ—అనసూయలు చచ్చిపోయిన ప్రదేశానికెళ్లి సాష్టాంగ నమస్కారంచేసి యింటి ముఖం పట్టాను బరువెక్కిన హృదయంతో.

చీకటి పడిపోయింది. దీపావళీ సంరంభం అడుగడుగునా ప్రతిధ్వనిస్తోంది. మందుగుండు సామాను చెవులు గింగురు మనిపిస్తోంది. యింటింటా దీపాల తోరణాలు, నావేపుచూసి చిరునవ్వు నవ్వుతున్నాయ్. పట్—పట్ మంటూ గెంతులేసే టపాకీలు వెక్కిరిస్తున్నాయ్—బుస్‌మని పొంగుకొచ్చే చిచ్చుబుడ్లు తెల్లటి 'లావా' గర్వంతో విరగబడిపోతోంది—"యీ వేళైనా ఆనందించవోయ్" అంటున్నట్టు కాకరపువ్వొత్తుల కిరణాలు చిరునవ్వులు చిందిస్తున్నాయ్—తారాజువ్వలు పందాలు వేసుకుని ఆకాశాన్నంటుకుంటున్నాయ్—రంగురంగుల మతాబాలు రకరకాల వెలుగుల్నిచ్చి తమ ప్రతాపాల్ని చూపిస్తున్నాయ్—చక్రకాయలు యేకనాధంగా "గుడిగుడిగుంచం" తిరుగుతున్నాయ్—ప్రకృతి వాతావరణమంతా యెంతో ఆనందదాయకంగావున్నా, నాలో లవలేశమూ మార్పు కనిపించలా. నేను అనసూయకి గావించిన ఘోరపాపం ఆసమయంలో నరనరాన్నీ కొరికపారేస్తోంది.

నా యువహృదయం నరికేసిన అరటి చెట్టుకిమల్లే కూలిపోయింది. ఆ విచారంతో—ఆ వియోగానల జ్వాలతో—యింటి కొచ్చాను. తీవ్రమైన జ్వరంతో మంచం పట్టాను—